క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సబ్ స్టేషన్ విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ ఏలూరురోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్ నుంచి ఎమ్మార్వో ఆఫీస్ ఏరియా, శివాలయం రోడ్డు, ప్రకాశం రోడ్డు, దూబగుంటవారి వీధి, మేరీ వీధి, అట్టారత్తయ్య వీధి, మసీదు వీధి, ఖాజాపున్నయ్య వీధి, గోపాల్ రెడ్డి రోడ్డు, గోపు వారి వీధి, తాడంకివారి వీధి, పోలీస్ డార్మెటరీ, మమత హోటల్ రోడ్డు, పాత బస్టాండ్ ఏరియా, ఏలూరురోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవస్థానం హుండీ ఆదాయం రూ. 5.26 లక్షలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం హుండీ ఆదాయం రూ. 5.26 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వై.సీతారామయ్య తెలిపారు. దేవస్థానంలో గురువారం నాలుగు హుండీలను లెక్కించారు. ఆలయ వంశపారపర్య ధర్మకర్త అప్పన సదాశివ సూర్యనారాయణ, దేవదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణ అధికారిగా సుజన్, రెవెన్యూ అధికారి పద్మ కుమారి, పోలీస్ అధికారి విజయలక్ష్మి పర్యవేక్షణలో హిందూ సేవాదళ్ సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీలు తెరిచారు. కెనరా బ్యాంకు సిబ్బందిచే నాలుగు హుండీలను లెక్కించారు. 90 రోజుల కాలానికి ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు సీతారామయ్య తెలిపారు. హుండీ ద్వారా రూ.5,26,346 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. బంగారం, వెండి వస్తువులు రాలేదని పేర్కొన్నారు.

ప్రతి గురువారం ఉచిత వైద్యసేవలు



మధురానగర్(విజయవాడసెంట్రల్):ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో ప్రతి గురువారం సాయంత్రం 7 గంటల నుంచి 8 గంటల వరకు ప్రముఖ వైద్యులచే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని మందిర అధ్యక్షులు పొన్నలూరి లక్ష్మణరావు తెలిపారు. ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో గురువారం సాయంత్రం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధ్యాత్మికత, సేవలను రెండు కళ్ళుగా చేసుకుని పనిచేస్తున్నామన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల అనారోగ్య సమస్యల పరిష్కారానికి ప్రతి గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మద్దు నాగ విజయశ్రీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అయ్యప్పలు, భవానీలకు అన్న ప్రసాదం



విజయవాడ కల్చరల్: అయ్యప్ప, భవానీ భక్తులకు సేవలు అందించాలని సాయి మణికంఠ భక్త బృందం వ్యవస్థాపకుడు తంపాల నాగేశ్వరరావు అన్నారు. భక్త బృందం ఆధ్వర్యంలో పాయకాపురంలో ప్రత్యేకంగా నిర్మించిన వేదిక మీద అయ్యప్పలకు, భవానీలకు గురువారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ భవానీ, అయ్యప్ప శివ స్వాములకు 2006 నుంచి అన్నప్రసాదం అందిస్తునట్లు తెలిపారు. అగురు త్రినాథనాయుడు ఆధ్వర్యంలో అయ్యప్పకు పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని భక్తులు ఈ అవకాశం వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

డ్రెయిన్లలో పూడికతీత

పటమట(విజయవాడతూర్పు): నగరంలో దోమలను నిర్మూలన చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు అన్ని ప్రాంతాల్లో ప్రధాన కాల్వలు, సైడు డ్రెయిన్లలో వెంటనే పూడిక తొలగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వీఎంసీ బయాలజిస్ట్ సూర్య కుమార్ ఆధ్వర్యంలో బుడమేరులో ట్రక్కర్ యంత్రంతో పూడిక తొలగించారు. బుడమేరు కాలువలో అత్యధిక పరికరాలైన ట్రక్సర్ మెషిన్, పడవలో మలేరియా వర్కర్స్ తో మరోవైపు లాంగ్ ఆర్మ్ తో పూడికలను తీశామన్నారు.

అందినకాడికి దండుకోవడమే!

- అమృత్ పథకంలో కుళాయి కనెక్షన్ కోసం డబ్బులు వసూలు
- ఇష్టానుసారం వసూలు చేస్తున్న కాంట్రాక్టర్
- చోద్యం చూస్తున్న అధికారులు



31వ డివిజన్ పసుపుతోటలో పైపులైన్ల కోసం తవ్విన సిమెంట్ రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్):అమృత్ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగునీరు అందించటానికి పలు డివిజన్లలో పనులు కొనసాగుతున్నాయి. అయితే ఈ పథకంలో భాగంగా పాత కనెక్షన్లకు ఉచితంగా కనెక్షన్లు ఇవ్వాల్సిన కాంట్రాక్టర్లు రేటు నిర్ణయించి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మాకు బోలెడు ఖర్చులు ఉంటాయని చెబుతుండటం విశేషం. ఇక్కడ ఫిట్టర్, కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కయ్యి కనెక్షన్ల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు కనీసం ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవటం అనుమానాలకు తావిస్తోంది. నగరంలో దశాబ్దాల తరబడి భూగర్భంలో ఉన్న మంచినీటి పైపులైన్ల స్థానంలో అమృత్ పథకంలో భాగంగా కొత్త పైపులైన్లు వేస్తున్నారు. 29వ డివిజన్ మధురానగర్, 31 డివిజన్ పసుపుతోట తదితర ప్రాంతాల్లో కూడా అమృత్ పథకంలో భాగంగా పాతలైన్ స్థానంలో ఏడాదిన్నర క్రితం కొత్త లైన్ వేశారు. ఆ పనులు ఇటీవల వరకు కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో ఇళ్లల్లోకి ఇచ్చిన పాత కనెక్షన్ డమ్మీ చేసి కొత్తలైన్ నుంచి ఇంటి లోపల వరకు కొత్త కనెక్షన్ ఇవ్వాలి. భూగర్భంలో కొత్త లైన్ వేశారు. కానీ కొత్తలైన్ నుంచి కనెక్షన్లు మాత్రం ఇవ్వలేదు. ఇటీవల కొత్త కనెక్షన్ ఇవ్వడానికి ప్రతి ఇంటి ముందు సిమెంట్ రోడ్డు గాడి కొట్టారు. పాత కనెక్షన్ డమ్మీ చేసి కొత్త కనెక్షన్ ఇవ్వటానికి కాంట్రాక్టర్ సిబ్బందిని పెట్టారు. ఈ సిబ్బంది మాత్రం ఏ మాత్రం భయం లేకుండా కనెక్షన్ ఇవ్వమంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల తీరు వల్ల ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత్ పథకం నీరు కారిపోయే ప్రమాదం ఉంది.

ఇంటికో రేటు...

29వ డివిజన్ మధురానగర్‌లో ఇంటిని బట్టి కనెక్షన్‌కు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. రూ. 3 వేలు నుంచి పదివేలు వరకు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మధురానగర్ నేతాజీ కాలనీలో అయితే ఏకంగా ఒక టీడీపీ నేత ఇంటికి కనెక్షన్ ఇవ్వటానికే రూ. 7 వేలు అడగటం గమనార్హం. ఇలా దొరికిన చోట దొరికినట్లు గుంజుతున్నారు. అడిగితే గుంత తవ్వాలి. కనెక్షన్ ఇవ్వాలి, పైపులైన్‌కు ఉండే వాల్వ్‌లో బాల్ తీసినందుకు అదనం అంటున్నారు. బాల్ తీసేస్తే నీటి ధార భారీగా వస్తుందని చెబుతున్నారు. కొంతమందైతే ఎందుకు వచ్చిన గొడవలే అని డబ్బులు చెల్లించి పనులు చేయించుకుంటున్నారు. కొత్తపైపులైన్ పనులు ఉన్నత అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. డబ్బులు డిమాండ్ చేస్తున్న సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.



వాటర్‌పైపులైన్ కనెక్షన్ల కోసం తవ్విన గొయ్యి

పైసా కూడా చెల్లించవద్దు

ప్రతి పాత కనెక్షన్‌కు మేము ఉచితంగా నూతన కనెక్షన్ ఇస్తాం. ఇందుకు గానూ ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే మా దృష్టికి తీసుకురావాలి. డబ్బులు అడిగిన వారిపై తగిన చర్యలు తీసుకుంటాం. పాత కనెక్షన్లు ఉన్న వారు ఎవరూ కూడా నూతన కనెక్షన్ కోసం పైసా కూడా చెల్లించ వద్దు.

వై.నాగేశ్వరరావు, ఏఈ అమృత్ పథకం

అమరావతి జపం తప్ప ప్రజా సమస్యలు పట్టవా..?

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి చంద్రబాబుకు అమరావతి జపం తప్ప.. ప్రజా సమస్యలు ఏమాత్రం పట్టడం లేదని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. అమరావతిలో రూ. 24,276 కోట్ల విలువైన పనులకు క్యాబినెట్ ఆమోదం తెలపడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పక్కనే కూతవేటు దూరంలో ఉన్న విజయవాడ నగరంలో అనేక సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నా.. ఇప్పటి వరకు కనీసం రూ. వెయ్యి కోట్లు కేటాయించిన పాపాన పోలేదన్నారు. బుడమేరు వరదల సమయంలో రెండున్నర లక్షల కుటుంబాలు నష్టపోతే.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఆదుకోలేకపోయారని ఆరోపించారు. ఓవైపు అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్ అని చెబుతూనే.. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు వేల కోట్ల రూపాయలు కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. అవి కూడా చాలవన్నట్లు హడ్కో, కేఎఫ్ డబ్ల్యూ ద్వారా అప్పులు తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు తీర్చాల్సిన బాధ్యత లేదా అని నిలదీశారు. గత ఆరున్నర నెలల కాలంలో 175 నియోజకవర్గాల అభివృద్ధికి ఈ ప్రభుత్వం కేటాయించిన నిధులెన్నో ప్రజలకు వివరించాలన్నారు. కరువు ప్రాంతాలను కూడా పట్టించుకోని విధంగా అమరావతి జపం చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. తమ హయాంలో అప్పులు చేస్తే రాష్ట్రం మరో శ్రీలంక అయిపోతుందని లబోదిబోమన్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలందరూ ఇప్పుడెందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన అప్పులు డీబీటీ ద్వారా నేరుగా పేదల ఖాతాలలోకి వెళ్లిందని.. కానీ కూటమి సర్కారు తీసుకొచ్చిన రూ. వేల కోట్ల అప్పులు ఏమయ్యాయో..? సమాధానం చెప్పాలన్నారు. మొత్తం ఆదాయ, వ్యయాలు శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు.

23న నగరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

- హాజరు కానున్న సీఎం చంద్రబాబు
- జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరగంలోని ఏ ప్లస్ కన్వెన్షన్ హాల్లో ఈ నెల 23వ తేదీన సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారన్నారు. సామూహిక క్యాండిల్ లైట్ కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేస్తారన్నారు. గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించే ఏ ప్లస్ కన్వెన్షన్‌ను ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త వెంకటేష్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. క్రైస్తవ మత పెద్దలు, చర్చి ఫాదర్లు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో వేడుకలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన క్రైస్తవ మత పెద్దలు, వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులకు ప్రోటోకాల్ ప్రకారం సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. వేదికను పరిశీలించిన వారిలో మైనార్టీ శాఖ కమిషనర్ సీహెచ్ శ్రీధర్, క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్, స్వామిదాస్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బాని, సమన్వయ కర్త ఇక్బల్ సాహెబ్, తహసీల్దార్ రోహిణిదేవి పాల్గొన్నారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యం

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధన దిశగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలకు ప్రాధాన్యమివ్వాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పారిశ్రామిక విధానాల కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పారిశ్రామిక అనుమతులు తదితరాలపై చర్చించారు. ఈ ఏడాది జూలై 26 నుంచి డిసెంబర్ 19 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 151 దరఖాస్తులు రాగా, వీటిలో ఇప్పటికే 133 ఆమోదం పొందాయని పరిశ్రమల శాఖ అధికారులు వివరించారు. మిగిలిన దరఖాస్తులను కూడా నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. 48 క్లెయిమ్‌లకు రూ. 2.21 కోట్లు, డిసెంబర్ 18న జరిగిన సమావేశం 31 క్లెయిమ్‌లకు రూ. 3.82 కోట్లు మేర ప్రతిపాదనలు పంపగా.. వీటిపై తాజాగా చర్చించి డీఐఈపీసీ ఆమోదం తెలిపింది. జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీపీవో పి.లావణ్య కుమారి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జి, పీసీబీ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ క్రికెట్ విజేత పీబీ సిద్ధార్థ



కృష్ణ వర్సిటీ క్రికెట్ పోటీల్లో గెలిచిన పీబీ సిద్ధార్థ జట్టును అభినందిస్తున్న దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: కృష్ణ యూనివర్సిటీ వెస్ట్ జోన్ అంతర కళాశాల క్రికెట్ పోటీల్లో పీబీ సిద్ధార్థ కళాశాల జట్టు విజయం సాధించింది. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నలంద కాలేజీ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్స్ లో ప్రత్యర్థి నలంద డిగ్రీ కాలేజీ జట్టుపై పీబీ సిద్ధార్థ కాలేజీ జట్టు 61 పరుగుల తేడాతో గెలిచి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేత జట్టును పీబీ సిద్ధార్థ కాలేజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సెక్రటరీ లక్ష్మణరావు, కన్వీనర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ బాబురావు, డీన్ రాజేష్, క్రీడా విభాగాధిపతి కృష్ణారెడ్డి కళాశాల ప్రాంగణంలో గురువారం అభినందించారు.

ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని వినతి

మధురానగర్(విజయవాడసెంట్రల్):30వ డివిజన్ 247 వార్డు సచివాలయంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో గురువారం దేవీనగర్ నాలుగో రోడ్డుకు చెందిన 32 మంది తమ ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా తాము ఇంటి పట్టాల కోసం వినతులు ఇస్తూనే ఉన్నామన్నారు. కానీ ప్రభుత్వాలు మారినా తమ ఇళ్లకు మాత్రం పట్టాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ఇళ్లకు పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేయాలని కోరారు. అలాగే ఇళ్లు కేటాయించాలంటూ పలువురు దరఖాస్తు చేసుకున్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురవారం బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు బాబాకు విశేషంగా పూజలు చేసి అన్నాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో విజయవాడ పైపులరోడ్డుకు చెందిన మహేష్ నృత్యాలయానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం కళావేదికపై గురువారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం దాసరి మహేష్ పర్యవేక్షణలో శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది. నృత్య ప్రదర్శనలో ఆరుగురు చిన్నారులు అద్భుతమైన ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు.

ఖిల్లా ఔన్నత్యాన్ని భావితరాలకు చాటాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఖిల్లా ఔన్నత్యాన్ని భావితరాలకు చాటి చెప్పడంతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.వాణీమోహన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. కొండపల్లి ఖిల్లాను గురువారం పరిశీలించారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఫొటోను యాప్ ద్వారా ఆండ్రాయిడ్ ఫోన్‌లో స్కాన్ చేసుకుని ఆ చిత్రం విశిష్టత తెలుసుకునేలా ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. పురాతన కట్టడాలు పరిశీలించి వాటి విశిష్టతపై ఆరా తీశారు. నర్తనశాల, మార్కెట్ యార్డ్ అత్తాకోడళ్ల కోనేరును సందర్శించారు. వాణీమోహన్ మాట్లాడుతూ దాదాపు 10వ శతబ్దం కాలం నుంచి స్వాతంత్ర్యం సిద్ధించే వరకు అనేక మంది రాజులు కొండపల్లి కోట నుంచి పరిపాలన సాగించారన్నారు. ప్రత్యేక రోజులలో హంగులు ఆర్భాటాలు ఖర్చు లేకుండా సహజసిద్ధమైన వాతావరణంలో శుభకార్యాలు నిర్వహించుకునేలా ప్రజలలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047లో విజన్ డాక్యుమెంట్‌లో పర్యాటక రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. టూరిజం శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వై.వి.ప్రసన్నలక్ష్మి, జిల్లా టూరిజం అధికారి ఏ.శిల్ప, సహాయ టూరిజం అధికారి డి.గోపాల్, పురావస్తు శాఖ ఉపసంచాలకుడు ఓ.రామసుబ్బారెడ్డి, పి.సురేష్, సహాయ సంచాలకుడు స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ఉజ్వల భవిష్యత్ అందించేందుకు కృషి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):కిశోర వికాసం ద్వారా బాలికలకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం కలెక్టర్ లక్ష్మీశ, మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విద్యార్థినులతో కిశోర వికాసం కార్యక్రమం అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలను సాధికారత దిశగా నడిపేందుకు కృషి చేయాలన్నారు. విద్య, మానసిక ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పోషకాహారం, అక్రమ రవాణా, పోక్సో చట్టం, ఆత్మ రక్షణ, యోగ జీవనోపాధి వంటి అంశాలపై బాలికల్లో పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. బాలికల భవిష్యత్తును మెరుగుపరచడానికి కిశోర వికాసం ఒక మంచి అవకాశమన్నారు. బాలికలు పూర్తి స్థాయిలో సామర్థ్యాన్ని పెంచుకునేందుకు కిశోర వికాసం దోహదపడాలని పేర్కొన్నారు. మానసిక నిపుణుల సహకారంతో బాలికలు మానసిక ఆరోగ్యంగా ఉండేలా కృషి చేయాలని కోరారు. యోగా వలన కలిగే మానసిక ప్రయోజన గురించి వివరించి ప్రతిరోజు యోగాసనాలు చేసేలా చైతన్యవంతులను చేయాలని సూచించారు. కిశోర వికాసంపై లఘు చిత్రాల ప్రదర్శన, వర్క్ షాపులు, చర్చా గోష్ఠి వంటివి నిర్వహించాలని తెలిపారు. బాల్య వివాహ నిషేధ చట్టం - 2006, బాలల లైంగిక దాడి నుంచి రక్షణ చట్టం (పోక్సో) -2012 తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. మహిళాశిశు సంక్షేమ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. ఉమాదేవి మాట్లాడుతూ కిశోర వికాసం కార్యక్రమంలో మార్పు ట్రస్ట్ ఆధ్వర్యంలో మేరీ స్టెల్లా కళాశాల విద్యార్థినులు నిర్దేశించిన అంశాలపై ఆరు నెలల ఇంటర్న్ షిప్ చేస్తున్నారన్నారు. విజయవాడ, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఆయా అంశాలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. మార్పు ట్రస్ట్ డైరెక్టర్ ఆర్. సూయజ్, సైకాలజిస్ట్ శివ జ్యోతి, చేయూత సంస్థ ప్రతినిధి టి. కృష్ణకుమారి, స్వీయ రక్షణ నిపుణురాలు లక్ష్మి సామ్రాజ్యం, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, స్టెల్లా కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించడం తప్పనిసరి

ఎన్టీఆర్ జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పద్మాకర్



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పద్మాకర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు కచ్చితంగా పాటించాలని ఎన్టీఆర్ జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పద్మాకర్ సూచించారు. మాచరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పద్మాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రోడ్లపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. రోడ్ సేఫ్టీ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె త్రిమూర్తులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు భద్రత నియమాలపై ఎంత అవగాహన కల్పించినప్పటికీ ప్రజలు వాటిని నిర్లక్ష్యం చేస్తున్నందున ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే భద్రత నియమాలపై అవగాహన పెంచుకోవటంతో పాటు తప్పక పాటించాలని సూచించారు. ఆర్టీవో ఆఫీస్ వైద్యులు డాక్టర్ తేజ సాయికిరణ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని మరి కొంతమంది అంగవైకల్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని తగ్గించడానికి ప్రజలకి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వారిని రక్షించేందుకు సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ సేవల గురించి పీపీటీ ద్వారా తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ డి.యుగంధర్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌పో ప్రారంభం



ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులను పరిశోధన, అభివృద్ధి వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని ఐకానిక్ స్కూల్ డైరెక్టర్ వై.పార్థసారథి తెలిపారు. ఏలూరు రోడ్డులోని ఐకాన్ పబ్లిక్ స్కూల్లో సైన్స్ ఎక్స్‌పో ప్రారంభమైంది. మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్, ఖగోళ శాస్త్రం, రక్షణ, సాంకేతిక రంగాలకు సంబంధించి 477 వర్కింగ్ మోడల్స్ ఎక్స్‌పోలో ఉంచారు. విద్యార్థులు ఆయా మోడల్స్ గురించి సందర్శకులకు వివరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. 20, 21, 22 తేదీల్లో జరిగే ఎక్స్‌పోలో విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించినట్లు చెప్పారు. ఎక్స్‌పో కోసం అద్భుతమైన నమూనాలు విద్యార్థులు రూపొందించారన్నారు. డైరెక్టర్ ఎం. లక్ష్మీప్రసాద్, కె.రాజేంద్ర, ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ



నూతన వస్త్రాలు అందజేస్తున్న రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ కొబ్బరితోట జీసస్‌ప్రేయర్ ఫెలోషిప్ చర్చిలో గురువారం సాయంత్రం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేపీఎఫ్ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం క్రిస్మస్ సందేశం వివరించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. ఏసుక్రీస్తు ప్రజల పాపాలను హరించటానికి రక్తం చిందించారని తెలిపారు. తోటివారికి సాయం చేయటం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. అనంతరం నిరుపేదలకు నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే నిరుపేదలు, విశ్వాసకులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో విశ్వాసకులు పాల్గొని ఏసుక్రీస్తు ప్రార్థనలు చేసి ప్రేమవిందు స్వీకరించారు. కార్యక్రమంలో బి.విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

మధురంగా సాగిన భక్తి గీతాలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న అతిథులు

విజయవాడ కల్చరల్: సెమీ క్రిస్మస్ సందర్భంగా సునీల్ ఆర్కెస్ట్రా ఈవెంట్స్ ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన భక్తి గీతాల కార్యక్రమం మధురంగా సాగింది, గాయకుడు సునీల్ ఆధ్వర్యంలో గాయనీ గాయకులు బి.అశోక్, రాజా, లక్ష్మణ్ నాయక్, డాక్టర్ భాగ్యశ్రీ,రజని, మహేశ్వరి క్రీస్తుని స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, వివిధ రంగాలకు చెందిన చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, జీవన్ వెంకట్రావ్, డీవీ వీరభద్రరావు, ముష్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నృత్య ప్రదర్శన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):సిద్ధార్థ ఆడిటోరియంలో క్షీర సాగర మధనం కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన శనివారం నిర్వహించనున్నామని సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన చావలి బాలా త్రిపుర సుందరీ బృందంలోని సభ్యులు ఈ కూచిపూడి నృత్య రూపక ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. అమృతాన్ని సేవించి పునఃశక్తివంతులు కావడం, దానవులు మోహినిని పట్టుకోడానికి ప్రయత్నించగా శ్రీమహా విష్ణువు తన స్వరూపాన్ని పొందటం వంటి సన్నివేశాలను ప్రదర్శిస్తారని వివరించారు.